సంక్షేమ పథకాలే పేదలకు రక్ష

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- 30మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- నూతన తహసీల్దార్ భవన నిర్మాణానికి భూమిపూజ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. ఆయన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి శనివారం మండల కేంద్రంలో 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించడంతో పాటు నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలతోనే మూడోసారి పార్టీకి ప్రజలు అధికారాన్ని కట్టబెడుతారన్నారు. అసత్య ప్రచారాలతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు గుణపాఠం నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. విద్యా, వైద్యం, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతులు ఆర్థికంగా బలపడేందుకు రైతు బీమా, రైతుబంధు పథకాలతో పాటు రైతులు పండించిన ధాన్యాన్ని నగదు ధరతో కొనుగోలు చేస్తున్నామన్నారు.

రూ.25కోట్లు మంజూరు..

వీపనగండ్ల మండలానికి రూ.25 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయించామని ఎమ్మెల్యే అన్నారు. గోవర్ధనగిరి సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ముంత మల్లయ్యయాదవ్, సురేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చంద్రకళ, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే పల్లె నిద్ర..

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించడం కోసమే పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం రంగవరంలో ప్రజాసమస్యలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి రాత్రికి అదే గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ గ్రామం నుంచి పెబ్బేరు పట్టణంతో పాటు మండల కేంద్రానికి కూడా రోడ్డు వసతి లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు రావడం లేదని వాపోయారు. గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో ప్రతి నెల రేషన్ బియ్యం కోసం 4 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ వేముల జయసుధ, మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, గోవల్‌దిన్నె సర్పంచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రంగవరంలో పల్లెనిద్రలో పాల్గొన్న ఎమ్మెల్యే బీరం

క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు సహకరించాలి



అమరచింత: పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు సంబంధించిన తేదీలను ఖరారు చేశామని బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తాటికొండ రమేష్, భాస్కర్, కొరి శ్రీను తెలిపారు. ఆగష్టులో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని 28, 29, 30 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో శనివారం బొడ్రాయి ఉత్సవ కమిటీ సమావేశమై పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. పట్టణ క్షేమం కోసం నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రజలు భాగస్వాములు అవ్వాలని కోరారు.

నేడు బండలాగుడు పోటీలు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం తొమ్మిదో వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు పేర్లను నమోదు చేసుకున్న వారు సకాలంలో హాజరుకావాలని కమిటీ సభ్యులు సూచించారు. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.60వేలు, ద్వితీయ బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.40వేలు, నాల్గవ బహుమతి రూ.30వేలు, ఐదో బహుమతి రూ.20వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఓటరు జాబితాను పూర్తి చేయాలి



ఆత్మకూర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. 2023 అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. జూన్ 23 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లెవల్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐలు జయమ్మ, నర్సింహులు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి అందరూ ఆరోగ్యంగా ఉండాలని పురచైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వార్డుల్లో పరిసరాలను శుభ్రపరిచారు. చెత్తను బయట పారబోయకుండా చెత్త డబ్బాల్లో వేసి చెత్త బండికి అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాతబట్టలు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు, పాత వస్తువులను సేకరించారు.

ఎల్‌ఓసీ అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మనిగిల్లకు చెందిన హెచ్.సువర్ణ కొంత కాలంగా కన్ను నొప్పితో బాధపడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా.. వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని బాధిత మహిళ కుటుంబ సభ్యులకు శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

ఆదర్శ వనిత రమాబాయి అంబేద్కర్



గోపాల్‌పేట: నవ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ భార్య రమాబాయి అంబేద్కర్ 88వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టీజేఏసీ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ పాల్గొన్నారు.

'ఆర్ఆర్ఆర్' అమలుపై సిబ్బంది అలసత్వం



ఆర్ఆర్ఆర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్ (ఫైల్)

అమరచింత: ప్రభుత్వం మున్సిపాలిటీ కేంద్రాల్లో ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని అమలు పరిచి వచ్చే నెల ఐదో తేదీ వరకు ఇళ్లలోని పాత వస్తువులను సేకరించే కార్యక్రమ లక్ష్యం నీరుగారుతుంది. ఆయా వార్డుల్లో సేకరించిన పాత వస్తువులను రీసైక్లింగ్‌కు పంపేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంపై నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. అమరచింత మున్సిపాలిటీలో సోమవారం మహిళా సమాఖ్య భవనం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించినా.. వార్డుల్లో వీటి యొక్క ఉద్దేశ్యాన్ని ముందుకు తీసుకెళ్లడం లేదు. మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది ద్వారా ప్రజలకు కార్యక్రమ లక్ష్యాన్ని వివరిస్తూ చెత్త, వాడి పడేసిన వస్తువులను సేకరించాల్సి ఉంది. కానీ ఒక్కరోజు మాత్రమే కార్యక్రమాన్ని నిర్వహించి మున్సిపల్ అధికారులు ఆర్ఆర్ఆర్‌ను గాలికి వదిలేశారు. పట్టణంలోని పది వార్డుల్లో తిరుగుతూ కాలనీలో ఏదో ఒక ప్రదేశంలో కార్యక్రమం నిర్వహించాల్సిన అధికారులు వీటి గురించి పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా మెప్మా, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేసే వరకు పోరాటం


రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

పాన్‌గల్: భారత రాజ్యాంగ గ్రంథం పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ ప్రచార కమిటీ నాయకుడు అశోక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని కలెక్టర్, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేసినా.. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో నిరసనలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేసే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు ఆదేశాలు జారీ చేయాలని, లేనిచో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బలరాం, రామకృష్ణ, విజయ్, రాముడు, శ్రీనివాస్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్, ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పాన్‌గల్: విత్తన, ఎరువుల దుకాణాల్లో స్టాక్, ధరల పట్టికల బోర్డులను తప్పక ఏర్పాటు చేయాలని మండల ఏఓ సాజీద్ ఉర్ రహమాన్ సూచించారు. శనివారం మండలంలోని రేమద్దులలో విత్తన, ఎరువుల దుకాణాలు, ఆగ్రో సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు చేసిన వస్తువులకు తప్పక బిల్లులు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు, గడువు దాటిన వాటిని విక్రయించిన, రైతులను మోసం చేసిన దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ మహేశ్వరీ పాల్గొన్నారు.

ముదిరాజులను 'బీసీ ఏ' లోకి చేర్చాలి


చైతన్య సభకు హాజరైన ముదిరాజులు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజులను బీసీ డీ నుంచి ఏ లోకి చేర్చాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గట్టుకాడిపల్లి, ఆగారం, కమాలోద్దీన్‌పూర్ గ్రామాల్లో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం చైతన్య సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ముదిరాజ్ ముద్దు బిడ్డ పండుగోళ్ల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎంతో కాలంగా ముదిరాజులను బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేస్తున్నామని ప్రభుత్వం పట్టించుకోవట్లేదని వాపోయారు. ముదిరాజులను చైతన్యం చేసేందుకు మండలంలోని అన్నిగ్రామాల్లో సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొదటి రోజు గట్టుకాడిపల్లిలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. మండల కార్యక్రమంలో నాయకులు , నాయకులు కృష్ణయ్య, సత్యం, దేవేందర్, శ్రీనివాసులు, మధు, అంజనేయులు, రాంచంద్రి, ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు నర్సింహులు, వెంకటేష్, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లో తూకం, బస్తాల తరలింపు విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి అన్నారు. మండలంలోని దావాజిపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించి తూకాలను పరిశీలించారు. ధాన్యం కాంటా చేసే విషయంలో తేమ పేరుతో సేకరణలో జాప్యం చేయవద్దన్నారు. కాంటా చేసిన ధాన్యంను జాప్యం లేకుండా మిల్లర్లకు తరలించాలని కోరారు. కేంద్రంలో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం, మిల్లర్లకు తరలింపు అంశాలపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట వీఆర్ఏ ఖగేందర్, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



మదనాపురం: మండలంలోని తిర్మాలయపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి శనివారం మదనాపురం జక్కుల నాగన్నయాదవ్, జక్కుల అనురాధ, బీఆర్ఎస్ మహిళ విభాగం మండల అధ్యక్షురాలు ఆధ్వర్యంలో రూ.21,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, సందు బాలయ్య, కొన్నూరు శ్రీను, ఉపాధ్యాయులు సంధ్య పాగ గోపాల్, ఆంజనేయులు, మన్యం, కురుమన్న, మహేష్, వెంకటేష్, విజయ్, అనిల్, కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి



గోపాల్‌పేట: తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వారి ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫార్ ఎన్విరాన్‌మెంట్)పై ఇంధన సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంసీ బాలరాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ మూర్తి పలు విషయాలపై అవగాహన ప్రజలకు కల్పించారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎల్ఈడీ బల్బులు అందించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



పాన్‌గల్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఓఆర్ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం నర్సమ్మ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు వడ దెబ్బ బారిన పడకుండా రక్షణగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వడదెబ్బతో విరేచనాలు అయిన చిన్నారులకు శక్తినిచ్చేందుకు జింకు మాత్రలను అందిస్తున్నామని తెలిపారు. ఎండ వేడిమి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమాస్పద మృతి: కేసు నమోదు

గోపాల్‌పేట: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని చెన్నారంలో శనివారం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. చెన్నారం గ్రామానికి చెందిన చీర్ల మహేష్ (38), భార్య మాధవికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ ఊర్లోనే నివసిస్తున్నారు. శుక్రవారం మహేష్ తల్లి కళావతమ్మ చేతికి కట్టు కట్టించుకునేందుకు కోడేరు మండలంలోని ముత్తిరెడ్డిపల్లికి వెళ్లింది. శనివారం ఉదయం మహేష్ అనారోగ్యానికి గురికావడంతో అతడి భార్య పిల్లలను తీసుకుని డాక్టర్‌ను తీసుకొచ్చేందుకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి వచ్చే సరికి మహేష్ మరణించి కనిపించాడు. విషయం తల్లి కళావతమ్మకు తెలియడంతో శనివారం గ్రామానికి పోలీసులను విషయం తెలియజేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీకి చెందిన ఐదో వార్డులోని దళిత కాలనీలో సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. కాలనీలో శనివారం సీపీఐ నాయకులు పర్యటించి అక్కడి సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని నెలలుగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయాయని మహిళలు సీపీఐ నాయకుల దృష్టికి తెచ్చారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తయి వినియోగంలో ఉన్న ఇక్కడ మాత్రం స్థానిక కౌన్సిలర్ పట్టించుకోవడం లేదన్నారు. ఈమేరకు సీపీఐ నాయకులు మాట్లాడుతూ కాలనీ పక్కన ఉన్న చెరువు కాల్వ నిర్మాణం కోసం రూ.80 లక్షలు మంజూరైన కాల్వను నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. దళిత వాడల అభివృద్ధిని విస్మరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్, ఎర్రన్న, కుతుబ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు


పునాది దశలోనే ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులు

అమరచింత: పట్టణంలో రూ.రెండు కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఏడాదిలోపు నిర్మాణ పనులు పూర్తి చేసి మున్సిపాలిటీకి అప్పగించాలనే నియమాలు ఉన్నా.. రెండేళ్ల కాలం గడుస్తున్న ఇప్పటికీ పునాదుల భర్తీ వరకే పనులు జరుగుతుండటం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో సామూహిక మార్కెట్ల కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించి షాపులను ఏర్పాటు చేయనుంది. వీటిలోనే విశ్రాంతి భవనంతో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా సదరు కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా పనులను చేపట్టకుండా దాటవేస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరితంగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నరేంద్రమోడీ సారథ్యంలోనే అభివృద్ధి


పెబ్బేరులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు: ప్రధాని నరేంద్రమోడీ పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని బీజేపీ ఓబీసీ అధికార ప్రతినిధి శ్రీశైలం అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు స్వసక్తి కరణ్ బూత్ కమిటీలు, కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తుకు చేసి ఓటర్లను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంచె అంజనేయులు, మండల అధ్యక్షుడు భగవంతు యాదవ్, నాయకులు వేమారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోనేల సహదేవుడు, రాఘవేంద్రగౌడ్, సర్వేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, మురళీధర్‌చారి, గోవిందునాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, కుబేరు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండలంలోని బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి తొమ్మిదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా అధికార ప్రతినిధి మనివర్ధన్‌సాగర్ అన్నారు. శనివారం ఆయన రేవల్లి మండలంలోని చీర్కపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్‌తో కలిసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, కరోనా వ్యాక్సిన్, రెండున్నరేళ్ల పాటు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం వంటివి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీశైలం, తిరుపతయ్య, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోపాల్‌పేట: గణతంత్ర దినోత్సవం 2024కు గాను వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సు. ధీర్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్, లిటరేచర్, ఎడ్యుకేషన్, స్పోర్ట్స్, మెడిసిన్, సోషల్ వర్క్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, ట్రేడ్ ఇండస్ట్రీ రంగాల్లో సాధించిన లక్ష్యాలు, చేసిన కృషిని రెండు పేజీలకు లేక 800 పదాలకు మించకుండా వాటి ప్రతులు నాలుగు సెట్ల నామినేషన్ హార్డ్, సాఫ్ట్ కాపీలు పీడీఎఫ్ ఫార్మాట్‌లో cyrteanfanafmai.com కు ఈనెల 29 తేదీలోపు అప్‌లోడ్ చేయాలని కోరారు. అప్‌లోడ్ చేసిన సమాచార కాపీని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ, రూం నెంబర్ 201, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వనపర్తికి పంపాలని కోరారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించేవరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని జేఏసీ మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. రిలేదీక్షల్లో శనివారం పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని 12 గ్రామాల ప్రజల మద్ధతుతో 127 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు గానీ, స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోయిల్‌కొండ: మండలంలోని ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించనున్నారని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొనాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

కొల్లాపూర్: ఉన్నత లక్ష్యాలను విద్యార్థులు సాధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సూచించారు. పాలిసెట్ ఎంట్రన్స్ టెస్టులో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. కేవైఎఫ్ ఆధ్వర్యంలో పాలిసెట్ ఉచిత శిక్షణ ఇవ్వడం ఇచ్చారని, శిక్షణ పొందిన విద్యార్థులు పలువురు మంచి ఫలితాలను సాధించారని తెలిపారు.

ఆర్థికసాయం అందించాలి

వీపనగండ్ల: గృహలక్ష్మి పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం అందించనున్న ఆర్థికసాయం ఇళ్లు లేని నిరుపేదలకు అందే విధంగా చూడాలని కోరుతూ గోవర్ధనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గోవర్ధనగిరిలో పార్టీలకు సంబంధం లేకుండా తాము నిర్వహించిన సర్వేల్లో 58 మంది నిరుపేదలను గుర్తించామని, వారికే ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని సంఘం నాయకులు ఆంజనేయులు, మహెబూబ్‌పాష, వెంకటస్వామి, పరమేశ్, శ్రీను కోరారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించుకోండి

చిన్నచింతకుంట: బీడీ కార్మికుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేఎస్ దేవదానం తెలిపారు. ఈ మేరకు 29న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లా పీఎఫ్ అధికారి రమేష్‌తో పాటు పలువురు అధికారులు హాజరుకానున్నారని వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో 4వ వార్డులోని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ ఖాజా ప్రారంభించారు. 30ఏళ్ల నుంచి కాలనీలో కరెంట్ సమస్య విపరీతంగా ఉందన్నారు. ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఉన్నాయని, రైతులకు 65శాతం రాయితీపై ఇస్తున్న ఏఓ నాగరాజు తెలిపారు. ఈ విత్తనాలు వాడటం ద్వారా వరి పొలాలు, చవుడు భూములు వేర్ల బుడిపెల నుంచి నత్రజని స్థిరీకరణ చేస్తుందని దీన్ని వరి నాటడానికి 50 రోజుల ముందు సాగు చేయాలన్నారు. ఎకరాకు కనీసం 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని తెలిపారు. జీలుగ కావాల్సిన రైతులు 30 కేజీల బస్తా రూ.843 ఇస్తున్నట్లు తెలిపారు. పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోన్ నంబర్‌తో వ్యవసాయ కార్యాలయంలో తీసుకోవాలని పేర్కొన్నారు.